క్లుప్తంగా

పుల్ వీల్స్‌తో రోడ్లపై తిరగొద్దు

తల్లాడ: మండలంలో పుల్ వీల్స్‌తో సీసీ రోడ్లపై తిరగొద్దని ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులకు తల్లాడ ఎంపీడీఓ బి.రవీంద్రరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున పొలాలకు వెళ్లేందుకు పుల్ వీల్స్‌తో ట్రాక్టర్లు రోడ్లపై తిరుగుతుండటం వల్ల రోడ్లు పాడైపోతున్నాయని, అంతర్గత సీసీ రోడ్లు కూడా దెబ్బతింటున్నాయన్నారు. ఒక వేళ ఎవరైనా తిరిగితే ట్రాక్టర్ డ్రైవర్ మరియు యజమానిపై కేసులు పెట్టనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌ను ఆదరించండి

సత్తుపల్లి: రానున్న ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేసే కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కొండూరు సుధాకర్ అన్నారు. సోమవారం జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో వాకర్స్‌ను కలిసి కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో గౌరిగూడెం సర్పంచ్ మందపాటి ముత్తారెడ్డి, మందపాటి రవీందర్‌రెడ్డి, కొత్తూరు కోటేశ్వరరావు, కిరణ్ పాల్గొన్నారు.

గొర్రెల పెంపకం లాభదాయకం

ఏన్కూరు: గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పురోగాభివృద్ధిలో గొర్రెల పెంపకం ఎంతో కీలకమని ఎంపీపీ ఆరెం వరలక్ష్మి అన్నారు. మండలంని నూకలంపాడులో సోమవారం గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం గొర్రెల పంపిణీ చేయడం వలన యాదవులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శేషయ్య, పశువైద్యాధికారి సుబ్బారావు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ దంపతులకు సన్మానం

కల్లూరు: సత్తుపల్లి డిపో కండక్టర్ కిన్నెర ఆనందరావు చేసిన పలు సేవా కార్యక్రమాలను గుర్తించి లైన్స్ క్లబ్ కల్లూరు, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఆనందరావు, పుష్పలత దంపతులను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆదివారం రాత్రి లయన్స్‌క్లబ్ కల్లూరు నూతన కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు దారా సురేష్ మాట్లాడారు. కల్లూరు నూతన బస్టాండ్‌లో వేసవిలో మజ్జిగ, కూలింగ్ మినరల్ వాటర్ లాంటివి దాతల సాయంతో ఆనంద్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షులు చలువాది నగేష్, నారాయణరావు, లంకా అప్పల నాయుడు, రాయల సత్యనారాయణ, చారుగుండ్ల అచ్యుతరావు, చుండూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధన్యజీవి తులిశమ్మ

కొణిజర్ల: నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు సీపీఐ అభివృద్ధికి కృషిచేసిన తులిశమ్మ ధన్యజీవి అని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ కొనియాడారు. సోమవారం ఆమె ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని తనికెళ్ల సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సభలో ఆయన పాల్గొని తులిశమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. యాసా వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో సీపీఐ జిల్లా నాయకులు బాబు, వెంకటేశ్వరరావు, కళావతి, లత, సీతా మహాలక్ష్మి, రామాంజనేయులు, ఎస్ టీయూ జిల్లా నాయకులు విష్ణుమూర్తి పాల్గొన్నారు.

'కార్మిక గర్జన'ను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

పెనుబల్లి: ఆగస్టు 4న హైదరాబాద్‌లో నిర్వహించనున్న కార్మిక గర్జనను జయప్రదం చేయాలంటూ ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు అమర్లపూడి శరత్ ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సోమవారం పెనుబల్లి ప్రభుత్వాస్పత్రిలో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 4న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరుగు కార్మిక గర్జనకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, పాపారావు, అరవింద్, లక్ష్మీ, నాగమణి, లలిత, బైరస్, బీబీ, లక్ష్మీ, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో సోమవారం రూ.5 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానిక సర్పంచ్ జంగా పుల్లారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, నాయకులు పిచ్చిరెడ్డి, నరసింహారావు, కృష్ణారావు, రామిరెడ్డి, వెంకటరెడ్డి, వేణు, వసంత్ కుమార్, పాపిరెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాసరావు, ప్రసాద్, పురుషోత్తం, ఏసుదానం, ఉమామహేశ్వరి, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాల్వ పనుల్లో.. కాలయాపనేలా..!

అధ్వానంగా నాగార్జున సాగర్ కాల్వలు
- గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలతో మేజర్, మైనర్ కాల్వలు
- ఎనిమిదేళ్లుగా జరగని మరమ్మతులు
- చివరి భూములకందని నీరు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు




సిరిపురం, లక్ష్మీనగర్ మేజర్ కాల్వల్లో పెరిగిన కంప చెట్లు, పిచ్చి మొక్కలు

తల్లాడ: నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకున్న నాగార్జున సాగర్ కాల్వలు(ఎన్నెస్పీ) ఎనిమిదేళ్లుగా మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా తయారయ్యాయి. నాగార్జున సాగర్ కాల్వల్లో గుర్రపు డెక్క, చెత్త చెదారంతోపాటు పూడిక పేరుకు పోయి పిచ్చి చెట్లు దట్టంగా అల్లుకు పోవడంతో సాగునీటి సరఫరాకు ఆటంకం కలుగుతుంది. ఫలితంగా సాగర్ చివరి ఆయకట్టుకు పూర్తి స్థాయిలో నీరందడం లేదు.

మేజర్, మైనర్ కాల్వల వివరాలిలా..

తల్లాడ మండలం ఎన్నెస్పీ కాల్వల మీదనే ఆదారపడి ఉంది. ఈ కాల్వలను 1997లో నిర్మించారు. మండలంలోని మొత్తం 41గ్రామాల్లోని ఆయకట్టు రైతులంతా ఎన్నెస్పీ కింద ఉన్న సిరిపురం, రామచంద్రాపురం, గూడూరు1, 2, పుణ్యపురం, బస్వాపురం మేజర్లు ఉన్నాయి. వీటి కింద పలు మైనర్లు, సబ్ మైనర్లు ఉన్నాయి. వీటి కింద సుమారు 26,000 వేల ఎకరాల్లో ఆయకట్టు రైతులు ఉన్నారు.

ఎనిమిదేళ్లుగా నోచుకోని మరమ్మతులు..

ఎన్నెస్పీ కాల్వలకు గత ఎనిమిదేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదు. ప్రతి ఏటా ఖరీఫ్‌కు ముందే కాల్వల్లో గుర్రపు డెక్క, పిచ్చి చెట్లును, పూడికలను తొలగించాలి. నిధులు లేమితో మరమ్మతులు జరగలేదు. కాల్వల్లో రెండు పక్కలా పెరిగిన పిచ్చి, కంప చెట్లతో నీటి సరఫరా సరిగా జరగడంలేదు.

అవస్థలు పడుతున్న రైతులు..

150 క్యూసెక్కుల నీటిని సరఫరా చేయాల్సిన మేజర్లలో 100 క్యూసెక్కుల నీటిని మాత్రమే అధికారులు విడుదల చేస్తున్నారు. దీంతో కాల్వల చివరి భూములకు ప్రతి ఏటా నీటి కటకట ఏర్పడడంతో అరకొరగా నీరందుతోంది. వరిపంట వేసిన రైతులు నీటికోసం కాల్వల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఇలా ఉంటే ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు నీరందటం కష్టమేనని రైతులు వాపోతున్నారు. ఎన్ఎస్పీ సిబ్బంది మాత్రం పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది ఇంకా పిచ్చి మొక్కలు, జంగిల్ క్లియరెన్స్ చేపట్టలేదు. ఎన్నెస్పీ అధికారులు, సిబ్బంది కాల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలి.

గుర్రపు డెక్క, కంప చెట్లు తొలగించాలి..



మేజరు కాల్వల్లో గుర్రపు డెక్క, కంప చెట్లు దట్టంగా పెరిగాయి. వీటితో పాటు నాచు కూడా అల్లుకు పోయింది. పూడిక పేరుకు పోయింది. వీటి వల్ల కాల్వల్లో నీటి సరఫరా సరిగా జరగడం లేదు. వెంటనే వీటిని తొలగించాలి. కాల్వలు బాగో లేక 100 క్యూసెక్కుల నీటిని మాత్రమే మేజరు కాల్వలకు నీటిని వదులుతున్నారు. ఇవి సరిపోవటం లేదు.

– ధర్మసోత్ రామా, రైతు, మల్సూర్‌తండా

నిధులు లేక మరమ్మతులు లేవు..



గత ఎనిమిదేళ్లుగా నిధులు మంజూరు కాక ఎన్నెస్పీ కాల్వలకు మరమ్మతులు చేయలేదు. దీంతో గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు కాల్వల నిండా అల్లుకు పోయాయి. నీటి సరఫరాకు ఇవి ఆటంకంగా మారి చివరి భూములకు నీరు అందడంలో జాప్యం జరుగుతుంది. ఉపాధిహామీ పథకం ద్వారా మరమ్మతులు చేసే అవకాశం ఉంది. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం.

– వి.శ్రీనివాసరావు, ఇరిగేషన్ డీఈ

వదలనంటున్న వాన



ముదిగొండ: రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు



ఏన్కూరు: భారీవర్షానికి నీట మునిగిన పత్తిచేను

ఏన్కూరు/ముదిగొండ: ఆదివారం రోజు మండలాల్లో వానలు కాస్త గ్యాప్ ఇచ్చాయని అనుకునేలోపే సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీవర్షం కురిసింది. ఈ వర్షానికి ఏన్కూరులోని ప్రధాన సెంటరు నుంచి ఆర్యవైశ్య కల్యాణమండపం వరకు వరదనీరు నిలిచింది. ముదిగొండలో ఖమ్మం – కోదాడ ప్రధాన రహదారిపై చెరువును తలపించేలా రోడ్డు కనిపించకుండా వర్షపు నీరు ప్రవహించింది. ముదిగొండలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట సైడ్ డ్రెయిన్ లేకపోవడంతో ప్రధాన రహదారిపై పలు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అంతే కాకుండా చెరువుల్లో నీరు చేరింది. లోతట్టు పోలాల్లో పత్తి పంట నీటమునిగింది.

ప్రభుత్వం అండగా ఉంటుంది..

కల్లూరు: ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. సోమవారం జిల్లా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సండ్రని కలుసుకుని ఘనంగా సన్మానించారు. దీంతో జిల్లా యూనియన్ నాయకులను సండ్ర అభినందించారు. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ జిల్లా అధ్యక్షుడు ధర్నాసి బాలరాజు మాట్లాడుతూ.. ఎలక్ట్రీషియన్లు వృత్తిలో ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి జీవిత బీమా రూ.10లక్షలు అందించాలన్నారు. కార్యక్రమంలో రైతు సమితి మండల కన్వీనర్ లక్కినేని రఘు, యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు వీరబాబు, కోశాధికారి వెంకటేశ్వరరెడ్డి, లీగల్ అడ్వైజర్ ఎస్‌కే పాషా, మీడియా ఇన్‌చార్జ్ డేవిడ్‌రాజు, కల్లూరు మండల అధ్యక్షుడు జయరాజు, కరుణాకర్‌రావు, సురేష్, రవి, హరి తదితరులు పాల్గొన్నారు.

సోలార్ యూనిట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే..

సత్తుపల్లిరూరల్: సింగరేణి సంస్థ ద్వారా కొత్తూరు గ్రామానికి ఏర్పాటు చేసిన తొలి సోలార్ మోటారును సోమవారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రారంభించారు. పల్లె ప్రకృతివనం, మెట్టాంజనేయస్వామి ఆలయం గుడి అవసరాల నిమిత్తం ఈ మోటార్‌ను ఇక్కడ ఏర్పాటు చేయటం జరిగిందని సర్పంచ్ ఒగ్గు విజయలక్ష్మి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి జీఎం షాలేంరాజు, పీఓ వెంకటాచారి, ఎంపీపీ హైమావతి, ఉపసర్పంచ్ పురుషోత్తం, రవీందర్‌రెడ్డి, జగ్గారెడ్డి, కొత్తూరు ఉమా, సత్యనారాయణ, రవి, కాంతారావు, అంకమరాజు, కేశవరెడ్డి, రమణ, వెంకటేశ్వరరావు, శ్రీను, దుర్గమ్మ, కౌసల్య, చెన్నయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

పెనుబల్లి: వీయంబంజర్‌కు చెందిన సీనియర్ జర్నలిస్ట్ పులిచర్ల నాగప్రసాద్ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆయనను సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ చెక్కిలాల మోహన్‌రావు, కనగాల వెంకట్రావు, గిరిజాపతిరావు, ప్రసాద్, తేజావత్ తావు, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలని నిరసనలు

మణిపూర్ అల్లర్లకు నిరసనగా అఖిలపక్షం నాయకుల ఆధ్వర్యంలో సోమవారం పలు ప్రధాన సెంటర్లలో ర్యాలీలు నిర్వహించి నిరసన తెలిపారు. వీరికి పలువురు ప్రజాప్రతినిధులు సంఘీభావం తెలిపారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గిరిజన మహిళల పట్ల పైశాచికంగా ప్రవర్తించి, అత్యాచారం చేసిన దోషులను బహిరంగంగా ఉరితీయాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిటౌన్: నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, డాక్టర్ రాగమయి, పాస్టర్లు



మధిర: నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



వైరారూరల్: ర్యాలీ తీస్తున్న సీపీఎం బాధ్యులు



కారేపల్లి: పేరుపల్లి గ్రామంలో..

కేసు నమోదు

ఏన్కూరు: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మండలంలోని రామాతండకు చెందిన సుతారీ బాతు వెంకటకృష్ణ(28) ఈనెల 19న పని కోసం ఏన్కూరు వెళ్లాడు. తిరిగి ఆయన ఇంటికి రాకపోవడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లేక వెంకటకృష్ణ భార్య జ్యోతి చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాదావత్ రవి తెలిపారు.

వ్యక్తిగత దూషణలు తగదు

కల్లూరు: ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను కించపరిచే విధంగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యక్తిగత దూషణలు చేయడం తగదని బీఆర్ఎస్ కల్లూరు మండల ఎస్సీ, ఎస్టీ నాయకులు అన్నారు. సోమవారం కల్లూరులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సత్తుపల్లిలో జరిగిన కాంగ్రెస్ పార్టీ సభలో మాజీ ఎంపీ పొంగులేటి.. కేసీఆర్‌కు మించిన దొర సండ్ర అని వ్యంగంగా మాట్లాడడం, అసెంబ్లీ గేటు తాకనీయనని, ఇంటికి పంపడం ఖామం అని అహంకార పూరింగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉబ్బన వెంకటరత్నం, కొరకొప్పు ప్రసాద్, మేలక కృష్ణ, ఆజ్మీరా జమలయ్య, నందిగామ ప్రసాద్, వెంకటేశ్వర్లు, సింగిశాల ప్రసాద్, ఖమ్మంపాటి పుల్లారావు, గొల్లమండల ప్రసాద్, విజయారావు, వీరయ్య తదితరులున్నారు.

రూ.లక్ష ఆర్థిక సాయంపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

కల్లూరు: తెలంగాణ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు రూ.లక్ష ఆర్థిక సాయం పథకాన్ని అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని ముస్లిం మైనార్టీలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక జామియా మసీదులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మండల కమిటీ సదర్ సయ్యద్ అలీ, మసీదు సదర్ ఎస్‌కే ఇమామ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఇస్మాయిల్, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే కమ్లి లు మాట్లాడారు. కార్యక్రమంలో రైతు సమితి మండల కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు, జిల్లా కమిటీ సభ్యుడు పసుమర్తి చందర్‌రావు, ముస్లిం కమిటి ప్రముఖులు ఎస్‌కే యాకూబ్ మియా, సయ్యద్ ఇషాక్, ఎండీ హనీఫ్, సయ్యద్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం..



కొండూరి కిరణ్‌కుమార్

కల్లూరురూరల్: కాంగ్రెస్ పార్టీ పెనుబల్లి మండల ఇన్‌చార్జ్‌గా కొండూరి కిరణ్‌కుమార్ నియమితులైనారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కిరణ్‌కుమార్ ఎంపీటీసీ సభ్యుడిగా, రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ డిపార్టుమెంట్ కన్వీనర్‌గా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా తనకు బాధ్యతలు అప్పగించిన డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, నియామకానికి సహకరించిన మాజీమంత్రి సంభాని చంద్రశేఖర్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పట్టాలు ఇచ్చినా.. దున్నుకోనివ్వడం లేదు



మండల సభలో మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

ఏన్కూరు: పోడు కొట్టుకొని సాగు చేసుకుంటున్న వారిపై అటవీశాఖ అధికారుల వేధింపులు ఆగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వమే రైతులకు పోడు పట్టాలు ఇచ్చినా అధికారులు మాత్రం దున్నుకోనివ్వడం లేదని మండలంలోని తిమ్మారావుపేట ఎంపీటీసీ గుగులోతు లచ్చిరాం ఆరోపించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం జరగగా ఎంపీటీసీ మాట్లాడారు. మండలంలోని మూలపోచారం, రంగాపురంలో పట్టాలు తీసుకున్న పోడు రైతులు దున్నుకుంటుండగా అటవీశాఖ అధికారులు అడ్డుపడుతున్నారని తెలిపారు. ఈమేరకు ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. అలాగే, వైస్ ఎంపీపీ పాశం శ్రీనివాసరావు, తూతకలింగన్నపేట సర్పంచ్ వీరభద్రం పలు సమస్యలను విన్నవించారు. అనంతరం ఎంపీపీ అరెం వరలక్ష్మి మాట్లాడగా తహసీల్దార్ ఎం.డీ.ముజాహిద్, సూపరింటెంట్ కృష్ణ పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తే ఊరుకోం



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కారేపల్లి: ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తే ఊరుకోబోమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి వట్టం నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కారేపల్లిలోని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొంతమంది నాయకులు ఏజెన్సీ చట్టాలపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారన్నారు. ఏజెన్సీ చట్టాలపై అవగాహన లేకుండా.. ఓటుబ్యాంకు రాజకీయాల కోసం కొంతమంది ఆదివాసీ ద్రోహులు కావాలని గిరిజనేతరులకు హక్కు కల్పించాలని మాట్లాడుతున్నారన్నారు. ఆదివాసీ బిడ్డలై ఉండి, ఎమ్మెల్యేగా చేసిన అనుభవం ఉండి కూడా తమ స్వార్థ రాజకీయం కోసం ఆదివాసీ ద్రోహులగా పనిచేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు శివరాం, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు లింగరాజు, రాంప్రసాద్, రాంప్రసాద్, రాంబాబు, సాగర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులంటే ఎవరికీ పట్టదు..



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వైరా: మన రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ఈ నాటివి కావు. అలాంటిది వారి సమస్యలు పరిష్కరించడానికి తీరిక లేదు బీఆర్ఎస్ నాయకులు ర్యాలీలు, బర్త్‌డే వేడుకలు జరుపుకోవడం ఎంత వరకు సమంజసమని టీడీపీ మండలాధ్యక్షుడు చెరుకూరి చలపతిరావు ప్రశ్నించారు. సోమవారం వైరాలో టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ చేయకుండా, సాగునీరు ఇవ్వకుండా బీఆర్ఎస్ నాయకులు రైతులను మభ్యపెట్టి మోసగించి ఓట్లు దండుకోవడానికి చూస్తున్నారన్నారు. వైరా రిజర్వాయర్ కింద నారుమడులకు ఇకనైనా నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మధుసూధనరావు, వెంకటేశ్వరరావు, సురేందర్, శ్యాంసుందర్, మురళి, శ్రీనివాసరావు, సత్యం, రామారావు, వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలి

తల్లాడ: ప్రతీ ఆశ కార్యకర్త పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు అన్నారు. సోమవాడం తల్లాడ రైతు వేదికలో వైద్య సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ పరిశుభ్రతపై శ్రద్ధతీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్వహించే యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, డాక్టర్ రత్న మనోహర్, భాస్కర్‌రావు, పుల్లయ్య పాల్గొన్నారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు



మధిర: మోటార్ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్, కొండబాల



వైరా: రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్, పక్కన మాజీ ఎమ్మెల్యే చంద్రావతి



సత్తుపల్లిరూరల్: కాకర్లపల్లిలో..

రాష్ట్ర పురపాలక, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను మండల కేంద్రాల్లోని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. పలు కార్యాలయాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి స్వీట్లు పంచి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలుచోట్ల భారీ మోటార్‌సైకిల్ ర్యాలీలు, అన్నదానాలు, రక్తదానాలు, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తండ్రికి తగ్గ తనయుడిగా రాష్ట్రాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న కేటీఆర్ నేతృత్వంలో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

వినతుల వెల్లువ..

జలవనరుల శాఖాధికారులకు..



జలవనరులశాఖ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

వైరా: వైరా రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వలకు తక్షణమే నారుమళ్ల రక్షణ కోసం నీరు విడుదల చేయాలని, కాల్వల మరమ్మతులు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో జలవనరుల శాఖాధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు కురుస్తునందున నీటి తడులు అవసరం లేకపోయిన వర్షాల తగ్గిన తర్వాత నీటి విడుదల అత్యవసరమన్నారు. సాగుకు నీరు విడుదల చేయకపోతే ఆందోళన తప్పదన్నారు. కార్యక్రమంలో బొంతు రాంబాబు, చిన సత్యనారాయణ, రామారావు, సాంబశివరావు, వెంకటేశ్వరరావు, వీరభద్రం, కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కి వినతి..



వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

మధిర: మహదేవపురం గ్రామంలో ఎస్సీలకు చెందిన ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించి, ప్లాట్లు చేసేందుకు ప్రయత్నిస్తున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా సోమవారం మహదేవపురం గ్రామానికి చెందిన ఆదూరి శ్రీనివాస్, కల్యాణ్, శ్రీను, రాజు కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించారు. గతంలో ఎస్సీ మాలలకు వ్యవసాయ భూమిని పంపిణీ చేసిన తర్వాత రాయపట్నం రెవెన్యూ సర్వే నంబర్ 227లో మిగిలిన 5.03 ఎకరాల ప్రభుత్వ భూమి కాసరా పహణీలో ఎస్సీ మాలల సమష్టి భూమిగా ఉందన్నారు. ఈ భూమిని కొంతమంది అగ్రకులం వారు ఆక్రమించుకొని ప్లాట్లు చేసి అప్పట్లో బీసీలుగా ఉన్న జంగాల కులస్తులకు ఇవ్వాలని ప్రయత్నం చేస్తున్నారన్నారు. దానిలో భాగంగా కొంతమంది పేర్లను కాసరా పహణీలో చేర్పించారన్నారు. ఈ సమస్యపై వెంటనే స్పందించి ఎస్సీ మాల కులంలో అర్హులైన నిరుపేదలకు ప్లాట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

ఎంపీడీఓకు..



ఎంపీడీఓ రవీంద్రరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు, పంచాయతీ వర్కర్లు

తల్లాడ: గ్రామ పంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం తల్లాడ ఎంపీడీఓ రవీంద్రరెడ్డికి సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. గత 19 రోజులుగా వారి న్యాయమైన కోర్కెల కోసం చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం మండల ఇన్‌చార్జ్ మాదినేని రమేష్, నాయకులు తాతా బాస్కర్‌రావు, శీలం సత్యనారాయణరెడ్డి, మోహన్‌రావు, వెంకటనరసయ్య, మస్తాన్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆళ్లపాడులో వైద్య శిబిరం

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో సీఎస్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయికిరణ్(ఎండీ) సుమారు 50 రోగాలకు సంబంధించి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. లేబర్‌కార్డు కలిగి ఉన్న వారి ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు తెలిపారు. క్యాంప్ ఇన్‌చార్జ్ జి.శ్రీనివాసరావు సర్పంచ్ మర్రి తిరపతిరావు, సీఐటీయూ బాధ్యులు ఖాసీం సాహెబ్, సాయికుమార్ పాల్గొన్నారు.